సాక్షి నంద్యాల

బుధవారం, 14, మే, 2025



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు మంగళవారం న్యూఢిల్లీకి చెందిన సందీప్‌శర్మ రూ.1,16,000 విరాళాన్ని పర్యవేక్షకులు జి.రవికి అందజేశారు.



భయపెట్టిన పిడుగులు

ఆస్పరి, ఆదోని, హొళగుంద ప్రాంతాల్లో పిడుగులు భయపెట్టాయి. ఆదోని సమీపంలో పిడుగుపాటుకు ఓ గొర్రెల కాపరి మృతి చెందాడు. పెద్ద గోనెహాళ్‌లో చెట్టుపై పిడుగు పడింది. 8లో▸



కిక్కు దిగేలా జరిమానా !

డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌లో పట్టుబడిన మందుబాబులకు కిక్కు దిగేలా న్యాయమూర్తి జరిమానా విధించారు. 18 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. 8లో▸

న్యూస్‌రీల్

12 మండలాల్లో అకాల వర్షాలు



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు 12 మండలాల్లో వర్షాలు కురిశాయి. నందవరంలో భారీ వర్షం కురిసింది. రికార్డు స్థాయిలో 69.8 మి.మీ వర్షపాతం నమోదైంది. కర్నూలు రూరల్‌లో 32.2, కర్నూలు అర్బన్‌లో 25.4, కల్లూరులో 23.2, మద్దికెరలో 7.6, ఓర్వకల్‌లో 6.8 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా సగటున 7.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లాలో ఈ నెల 14న 3 మి.మీ, 15న 7.4, 16న 9, 17న 8.3 మిమీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. నంద్యాల జిల్లాలో 14న 2.1, 15న 9.8, 16న 12.1, 17న 10.1 మిమీ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్నట్లుగా అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులతో పిడుగులు పడే ప్రమాదం కూడా ఉన్నట్లు పేర్కొన్నారు.

వాము వ్యాపారులు సిండికేట్

● తగ్గిన ధరలతో నష్టపోతున్న రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వాము వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను నష్టాలకు గురి చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మార్కెట్‌కు మంగళవారం 88 మంది రైతులు 280 క్వింటాళ్ల వాము తెచ్చారు. కనిష్ట ధర రూ.611, గరిష్ట ధర రూ.24,306 లభించింది. సగటు ధర కేవలం రూ.10,288 మాత్రమే నమోదైంది. వ్యాపారులు ఒకటి, రెండు లాట్లకు మాత్రమే ఎక్కువ ధర వేసి మిగిలిన లాట్లకు తక్కువ ధరలు కోట్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వ్యాపారులు సిండికేట్ కావడం వల్లే సగటు ధర రూ.10 వేలు మాత్రమే నమోదైందని రైతులు వాపోతున్నారు. కాగా వాము వ్యాపారులు టెండర్ హాల్‌లో యథేచ్ఛగా తిరుగుతూ ధరలను తారుమారు చేస్తున్నట్లు తెలుస్తోంది. టెండర్ హాల్‌లో కంప్యూటర్ ఆపరేటర్లను లోబరుచుకొని తమకు అనుకూలంగా ధరలు మారుస్తున్నారనే చర్చ జరుగుతోంది.

హ్యాండ్‌లూమ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

నంద్యాల(న్యూటౌన్): వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ నందు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ ఓఎస్‌డీ గిరిధర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల డిప్లొమా కోర్సులకు హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ 53 సీట్లు, తమిళనాడులో 12 సీట్లు, కర్ణాటకలోని గడగ్ నందు నాలుగు సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అర్హులైన వారు www.iihtvgr.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం సెల్ నంబర్ 93999 36872ను సంప్రదించవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 1వ తేదీ వరకు గడువు ఉందని వెల్లడించారు

ఆడనే చంపేస్తున్నారు!

- యథేచ్ఛగా భ్రూణ హత్యలు
- ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్
- ప్రోత్సహిస్తున్న వైద్యులు, పలు ప్రైవేట్ ఆసుపత్రులు
- స్కానింగ్ సెంటర్లపై నిఘా శూన్యం
- తూతూ మంత్రంగా తనిఖీలు
- గత నెలలో 40 సెంటర్లలో తనిఖీలు.. అంతా బాగుందని సర్టిఫికెట్

ఒక బిడ్డకు జన్మనివ్వాలన్నది ప్రతి స్త్రీ కల. ఆ కలను సాకారం చేసుకునే క్రమంలో సంతానలేమితో బాధపడే వారి వేదన అంతా ఇంతా కాదు. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు మాత్రం కడుపులో ఉన్నది ఆడబిడ్డ అని తెలియగానే చేతులారా అబార్షన్ చేయించుకుంటున్నారు. ఆడ బిడ్డ పుడితే అత్తింటి వేధింపుల భయంతోనే కొందరు కడుపులోనే పిండాన్ని నిర్దాక్షిణ్యంగా తొలగించుకుంటున్నారు. ఈ కారణంగా సమాజంలో స్త్రీ, పురుషుల నిష్పత్తిలో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది. ఆడపిల్లలు లభించక చాలా మంది పురుషులకు వివాహాలు కాని పరిస్థితి నెలకొంది.



స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లోని స్కానింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ





కర్నూలు(హాస్పిటల్): 'భ్రూణ హత్యలు వద్దు.. ఆడపిల్లలను బతకనిద్దాం.. లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు'.. అంటూ అధికారులు పలు వేదికలపై ఈ అంశంపై అవగాహన కల్పిస్తున్నా ఇంకా కొందరిలో మార్పు రావడం లేదు. జిల్లాలో భ్రూణ హత్యలు జరుగుతూనే ఉన్నాయి. వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 240 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇంకా కొత్తగా దరఖాస్తు చేసుకున్నవి 8, రెన్యువల్ కోసం వచ్చినవి మరో 15 దాకా ఉన్నాయి. వీటికి జిల్లా కమిటీ పరిశీలించి అనుమతులు జారీ చేయాల్సి ఉంది. అధికారికంగా ఉన్న స్కానింగ్ కేంద్రాలే గాక అనధికారికంగా జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల అనుమతులు లేకుండా స్కానింగ్ మిషన్లు ఏర్పాటు చేసుకుని స్కానింగ్ చేస్తున్నట్లు సమాచారం. వీటిలో కర్నూలుతో పాటు కోడుమూరు, గూడూరు, ఎమ్మిగనూరు, ఆదోనిలోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లలో కొందరు వైద్యులు స్కానింగ్ ద్వారా లింగనిర్ధారణ చేస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో కడుపులో ఉన్నది ఆడబిడ్డ అని తెలిస్తే చాలు నిర్దాక్షిణ్యంగా అబార్షన్(భ్రూణహత్య)లు చేయించుకుంటున్నారు. ఇందుకు సాక్ష్యంగా అప్పుడప్పుడూ కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల పరిసర ప్రాంతాలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని శివారు ప్రాంతాల్లో మృతశిశువులు వెలుగు చూస్తుంటాయి.

ఇలా లభించిన వాటి గురించి ఏ ఒక్క అధికారి కూడా విచారణ చేసి చర్యలు తీసుకున్న దాఖలాలు ఇప్పటి వరకు జిల్లాలో నమోదు కాలేదు. అంతెందుకు గత పదేళ్లలో ఒక్క స్కానింగ్ కేంద్రం, వైద్యులపై కూడా స్కానింగ్ అక్రమాల గురించి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత ఏప్రిల్ నెలలో జిల్లాలో వైద్యుల బృందం 40 స్కానింగ్ కేంద్రాల పరిశీలనకు వెళ్లింది. అన్ని స్కానింగ్ కేంద్రాల్లో రికార్డులు, రిపోర్టులు, మిషన్లు, వైద్యుల వివరాలు, గర్భిణీల వివరాలు అన్నీ సక్రమంగా ఉన్నాయని అధికారులకు రిపోర్టు ఇవ్వడం గమనార్హం.

ఆర్‌ఎంపీలకు నజరానాలు

జిల్లాలో డోన్, కృష్ణగిరి, ఆదోని, పత్తికొండ, కోసిగి, హొళగుంద, పెద్దతుంబళం, చిన్నతుంబళం, మంత్రాలయం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కౌతాళం వంటి వెనుకబడిన ప్రాంతాలే గాక తెలంగాణా, కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి సైతం స్కానింగ్ కోసం గర్భిణులు కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరుకు వస్తుంటారు. ఇందులో కొందరికి అప్పటికే ఆడపిల్లలు జన్మించి ఉండటంతో మళ్లీ ఆడ బిడ్డ జన్మిస్తే కుటుంబంలో పెద్దలు ఒప్పుకోరని భావించి స్కానింగ్‌లో ఆడబిడ్డ అని తేలితే అబార్షన్ చేయించుకోవడానికి సిద్ధపడి వస్తారు. ఈ మేరకు కర్నూలులోని కొత్తబస్టాండ్, గాయత్రి ఎస్టేట్, బుధవారపేట, ఎన్‌ఆర్ పేట, కోడుమూరు, గూడూరు, ఎమ్మిగనూరు, ఆదోనిలోని కొన్ని ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలకు గర్భిణులను తీసుకొస్తారు. లింగ నిర్ధారణతో పాటు అవసరమైతే భ్రూణహత్య (అబార్షన్) చేయడానికి కూడా వెనుకాడటం లేదు. ఈ తతంగంలో మొత్తం సూత్రధారులు ఎక్కువగా ఆర్‌ఎంపీలే ఉంటున్నారు. లింగనిర్ధారణకు రూ.4వేల నుంచి రూ.5వేలు, అబార్షన్‌కు రూ.15వేల నుంచి రూ.20వేల దాకా తీసుకుంటున్నారు. ఇందులో ఆర్‌ఎంపీలకు 20 నుంచి 40 శాతం వరకు కమీషన్ ముట్టజెబుతున్నారు.

లింగనిర్ధారణ చేస్తే జైలుకే...కానీ...!

భ్రూణహత్యల నివారణకు కేంద్ర ప్రభుత్వం 1994లో పీసీ పీఎన్‌డీటీ యాక్ట్‌ను తీసుకొచ్చింది. దీని ప్రకారం లింగనిర్ధారణ చేసినా, గర్భస్రావాలు చేయించినా ఇరువర్గాలను శిక్షించే వీలుంది. మొదటిసారి తప్పు చేస్తే మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా, రెండోసారి తప్పు చేస్తే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తారు. అయితే ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా కేసు నమోదు చేసిన దాఖలాలు లేవు. ఈ చట్టం కింద ఏ ఒక్కరికీ శిక్ష పడదు. ఈ చట్టం ఒకటి ఉందని రోగులకు, గర్భిణీలకు తెలిసేటట్లు ఆయా స్కానింగ్ కేంద్రాల్లో పోస్టర్లు మాత్రం ప్రదర్శించి ఉంటాయి. కానీ కొన్నిచోట్ల అదే ప్రాంతాల్లో లింగనిర్ధారణ జరుగుతుంది. గతంలో 10 ఏళ్ల క్రితం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కర్నూలు, కోడుమూరు, గూడూరు ప్రాంతాల్లో స్కానింగ్ సెంటర్లపై దాడులు నిర్వహించి స్కానింగ్ మిషన్లను సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన మిషన్ల పక్కనే మరో మిషన్‌ను తీసుకొచ్చి లింగనిర్ధారణ చేసిన వైద్యశిఖామణులు ఉన్నారు. ఆయా ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు రాజకీయ నాయకుల పలుకుబడి ఉండటంతో ఇలా సీజ్ చేస్తే అలా తెరిపించుకునే స్థాయిలో ఉన్నారు.

తిరిగి దాడులు, తనిఖీలు నిర్వహిస్తాం



జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలను తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నాము. ఈ మేరకు ఐదుగురు వైద్యులతో బృందాలను ఏర్పాటు చేశాం. ఈ బృందాలు గత ఏప్రిల్‌లో 40 స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అయితే ఆయా కేంద్రాలను తిరిగి తనిఖీ చేసి వాస్తవ పరిస్థితులను నిగ్గు తేలుస్తాం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారి పేరు, వివరాలు బహిర్గతం గాకుండా చేసి, సదరు స్కానింగ్ కేంద్రంపై దాడులు నిర్వహిస్తాం. రెగ్యులర్‌గా ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై దాడులు ముమ్మరం చేస్తాం. లింగనిర్ధారణ, అబార్షన్లు చేసే ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్‌వో, కర్నూలు

పెండింగ్ పనులు పూర్తి చేస్తేనే నీటి నిల్వ

● గోరుకల్లు జలాశయాన్ని పరిశీలించిన నిపుణుల బృందం



కుంగిన కట్టను పరిశీలిస్తున్న నిపుణులు

పాణ్యం: గోరుకల్లు జలాశయం పెండింగ్ పనులు పూర్తి చేస్తేనే నీటి నిల్వకు అవకాశం ఉంటుందని నిపుణుల బృందం సభ్యులు అధికారులకు సూచించారు. జలాశయం కట్ట కుంగిపోతుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యులు సందర్శించారు. కమిటీలోని సీడీఓ సీఈ విజయభాస్కర్, సీఈ కబీర్‌బాషా, ఎస్‌ఈ శివకుమార్‌రెడ్డి, ఈఈ మనోహర్‌రెడ్డి, సుభకుమార్, డీఈలు రీనా, కేధారేశ్వరరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఈఈ ప్రసూనాదేవి తదితరులు జలాశయాన్ని సందర్శించారు. ముందుగా డ్యామ్ డిజైన్, కట్ట కుంగిన ప్రాంతం, జారుతున్న రాతిపరుపు, లీకేజీలు తదితర అంశాలను పరిశీలించారు. ఒకే చోట కట్ట కుంగడంపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం కట్ట కుంగిన చోటా ఎత్తు 259 మీటర్లు మాత్రమే ఉందని, 265.06 మీటర్లు ఎత్తు నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. కట్ట పూర్తి స్థాయిలో నిర్మించి కాంక్రీట్ చానెళ్లు ఏర్పాటు చేస్తే వర్షపు నీరు కట్టలోకి వెళ్లకుండా నేరుగా జలాశయంలోకి వెళ్తుందన్నారు. భూమి లోపల పొరల వల్ల కూడా కట్ట కుంగే ప్రమాదం ఉందన్నారు. కట్టలోని 7 ప్యానెళ్లలో రాతి పరుపు దెబ్బతిన్నట్లు గుర్తించి లూస్ సాయిల్‌ను తొలగించాలన్నారు. కొత్తగా కంకర, ఇసుకతో ఫిల్ చేసి కట్టను పటిష్టం చేయాలని సూచించారు. జలాశయంలో పరిశీలించిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. వారి వెంట డీఈఈలు జ్యోతి, గీతా, శివప్రసాద్, ఏఈలు, జేఈఈలు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

● జిల్లా కలెక్టర్ రాజకుమారి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): డ్రోన్ టెక్నాలజీతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కిసాన్ డ్రోన్స్ వినియోగంపై గ్రూప్ కన్వీనర్, కో–కన్వీనర్, అధికారులు, ఎఫ్‌పీఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు గ్రూపులకు కూడా డ్రోన్లు పంపిణీ చేశామని, జిల్లాలో ఇప్పటి వరకు 40 డ్రోన్ల వరకు వినియోగించడం జరుగుతోందన్నారు. రాను న్న రోజుల్లో అధునాతన సాంకేతికత డ్రోన్లు రానున్నాయన్నారు. డ్రోగో కృషి 3ప్రో అనే డ్రోన్ సుమా రు 9.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని అందులో 80 శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటిని ఆటోమేటిక్, మాన్యువల్ పద్ధతి ద్వారా వినియోగించే అవకాశం ఉంటుందన్నారు. నానో యూరియా వినియోగానికి డ్రోన్లను ఉపయోగించుకోవచ్చునన్నారు. రసాయన ఎరువుల విచ్చల విడిగా వినియోగిస్తే భూసారం తగ్గిపోయి దిగు బడులు తగ్గుపోతాయన్నారు. జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలైన నువ్వులు, బ్లాక్ గ్రామ్, సోయా, కొర్ర తదితర పంటలు వేసేలా రైతులను ప్రోత్సాహించాలన్నారు. అంతకుముందు పలువురు కిసాన్ డ్రోన్స్ సాంకేతిక వినియోగం, ఉపయోగాలు, బ్యాంకు రుణం తదితర అంశాలపై వ్యవసాయ అధికారులు, రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఎల్‌డీఎం రవీందర్ కుమార్, ఆర్‌ఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ రామకృష్ణా రావు, నాబార్డు డీడీఎం, డ్రోన్ నిర్వాహకులు చైతన్య, రైతులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాతూరు తిప్ప కరిగిపోతోంది!

- అధికార పార్టీ నేతల అక్రమ తవ్వకాలు
- యథేచ్ఛగా బింగ గ్రావెల్ తరలింపు
- రోజూ వందకు పైగా ట్రిప్పులు లూటీ

పగిడ్యాల: అక్రమార్జనే ధ్యేయంగా అధికార పార్టీ నేతలు సహజ వనరుల లూటీకి తెగబడ్డారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా శ్రీశైలం రిజర్వాయర్ మునక భూముల్లోని బింగ గ్రావెల్‌ను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నెహ్రూనగర్ పాతూరు తిప్పలో వేల టన్నుల విస్తారమైన బింగ గ్రావెల్ నిక్షిప్తమై ఉంది. ఈ గ్రావెల్‌ను కొల్లగొట్టేందుకు అధికార పార్టీ నాయకుల కన్ను తిప్పపై పడింది. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ రవాణా చేస్తున్నారు. ఒక ట్రిప్పు బింగ గ్రావెల్‌ను రూ. 1,600 ప్రకారం విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. సుమారు పది ట్రాక్టర్లలో రోజుకు 120 ట్రిప్పులకు పైగా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. గ్రావెల్ దందాపై తహసీల్దార్ శివరాముడును వివరణ కోరగా.. గ్రావెల్ అక్రమ తరలింపును నిలిపివేయాలని ఆదేశించామన్నారు. అయితే గ్రావెల్ కోసం అర్జీ ఇవ్వగా దానిని భూగర్భ, గనుల శాఖ అధికారులకు పంపామని తహసీల్దార్ పేర్కొనడం గమనార్హం.



గ్రావెల్ తవ్వకాలకు జేసీబీ, ట్రాక్టర్లు



బింగ గ్రావెల్‌తో వెళ్తున్న ట్రాక్టర్

గ్రామస్తులైనా గేట్ కట్టాల్సిందే!

- తెలుగు తమ్ముళ్ల హుకుం
- అహోబిలంలో ఉద్రిక్తత

ఆళ్లగడ్డ: అహోబిలం గ్రామం టోల్‌గేట్ విషయంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గ్రామానికి చెందిన కొందరు యువకులు మంగళవారం ఆటోలో వస్తుండగా టోల్‌గేట్ వద్ద ఉన్న తెలుగు దేశం పార్టీకి చెందిన వ్యక్తి టోల్‌గేట్ కట్టాలని ఆటో నిలిపాడు. గ్రామానికి చెందిన వాహనాలకు టోల్‌గేట్ లేదు కదా.. ఎందుకు కట్టాలి.. అని యువకులు ప్రశ్నించడంతో ఎవరైనా కట్టాల్సిందే.. గేట్ కట్టే వరకు ఆటో కదలనిచేది లేదు. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోమంటూ బెదిరించడంతో యువకులు తిరగబడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. అక్కడే ఉన్న కొందరు సర్దిచెప్పడంతో ఆటోను వదిలేశారు. అయితే అధికారపార్టీ అండ చూసుకుని ఎప్పుడు లేనిది గ్రామానికి చెందిన వాహనాలకు కూడా గేట్ వసూలు చేయడం ఏమిటని, గ్రామానికి చెందిన యువకులు టోల్‌గేట్ నిర్వాహకుడిని నిలదీసేందుకు గుంపుగా బయలుదేరారు. అంతలో విషయం తెలుసుకున్న సీఐ మురళీధర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను మందలించడంతో సమస్య ప్రస్తుతానికి సద్దుమణిగింది.

బదిలీలకు వేళాయె!

- ఉపాధ్యాయుల బదిలీలకు రంగం సిద్ధం
- త్వరలో వెలువడనున్న నోటిఫికేషన్?
- జిల్లాలో 3 వేల మందికి పైగా అర్హులు
- బదిలీలపై గుర్రుగా ఉన్న ఉపాధ్యాయ సంఘాలు
- తమ సూచనలను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్



నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ బదిలీలకు పాఠశాల విద్యాశాఖ సన్నాహాలు చేపట్టింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలోనే వెలవడనుంది. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు, జీఓ 117 రద్దు మార్గదర్శకాల విడుదలకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాలు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం, విద్యాశాఖ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపై ఉపాధ్యాయ సంఘాలు గుర్రుగా ఉన్నాయి. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన దరఖాస్తు, స్థానాల ఎంపిక, కేటాయింపు ఇలా మొత్తం ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరగనుంది. నంద్యాల జిల్లా ప్రాతిపదికన నిర్వహించే బదిలీలకు సంబంధించి త్వరలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. 2023 జూన్‌లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు చేపట్టింది. గతేడాది ఎన్నికల నేపథ్యంలో బదిలీల ప్రక్రియను చేపట్టలేదు, రెండేళ్ల తర్వాత తిరిగి నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి జూన్ 1 నుంచి మే 31వ తేదీ వరకు విద్యా సంవత్సరం ప్రాతిపదికన తీసుకోనున్నారు. ఇందులో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు కనీస సర్వీసు రెండు సంవత్సరాల నుంచి ఎనిమిదేళ్ల వరకు తీసుకోనున్నారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలకు ఐదేళ్లగా నిర్ణయించారు.

ఖాళీల వివరాలు డిస్‌ప్లే

ఆయా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి బదిలీ కోరుకునే ఉపాధ్యాయులకు డిస్‌ప్లే చేస్తారు. ఈ ఏడాది మే నెలాఖరు వరకు ఉన్న అన్ని ఖాళీలను బదిలీల్లో చూపుతారు.

☛ 2020 మే 31కు ముందు పాఠశాలల్లో చేరిన హెచ్‌ఎంలకు ఐదేళ్లు అదే పాఠశాలల్లో విద్యా సంవత్సరాలు పూర్తవుతున్నందున తప్పని సరిగా బదిలీ కావాల్సి ఉంటుంది.

☛ 2017 మే 31కి ముందు పాఠశాలల్లో చేరిన ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు ఎనిమిది సంవత్సరాలు పూర్తవుతున్నందున తప్పని సరిగా బదిలీ కావాలి.

☛ 2027 మే నెలాఖరులోపు ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయులకు బదిలీల నుంచి మినహాయింపు ఉండే అవకాశం ఉంది.

☛ జిల్లా వ్యాప్తంగా అన్ని క్యాడర్‌లకు సంబంధించి 4,927 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో తప్పని సరి బదిలీలకు సంబంధించి 3 వేల మంది దాకా ఉండవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునః ప్రారంభం నాటికి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

జిల్లాలో ఉపాధ్యాయుల వివరాలు..

యాజమాన్యం	ఉపాధ్యాయుల సంఖ్య
ఎంపీపీ, జెడ్పీ	40,505
మున్సిపాలిటీ	169
ప్రభుత్వ	253
మొత్తం	4,927

చర్చలలో ఒక తీరు, నిర్ణయాలు మరో తీరు



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన విధివిధానాల పై ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపినపుడు ఒక తీరుగా, నిర్ణయాలను అమలు చేసేటప్పుడు మరో తీరుగా వ్యవహరిస్తోంది. జీఓ 117ను బేషరతుగా రద్దుచేసి, దాని స్థానంలోనే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసి దాని ఆధారంగా మాత్రమే పాఠశాలలను పునః వ్యవస్థీకరించాల్సి ఉండగా అందుకు భిన్నంగా వ్యవహరిస్తుంది. స్కూల్ అసిస్టెంట్ల స్థాయిని దిగజార్చి మోడల్ ప్రైమరీ స్కూళ్లకు హెడ్మాస్టర్‌గా నియమిస్తామనడం సరికాదు.

– సుబ్బన్న ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు, నంద్యాల

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి



అధిక సంఖ్యలో ఉండే ఎస్‌జీటీ ఉపాధ్యాయులకైనా మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలి. బదిలీల ప్రక్రియకు ముందే ప్లస్-2 ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ తరగతులు బోధించేందుకు అర్హులైన ఉపాధ్యాయులను నియమించాలి. ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించి అదనంగా పోస్టులను కేటాయించాలి.

–శివయ్య, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, నంద్యాల

ఏకపక్ష నిర్ణయాలతో గందరగోళం



ఉపాధ్యాయ సంఘాలు చేసిన సూచనలను ఏమాత్రం పరిగణనలోనికి తీసుకోకుండా విద్యా శాఖాధికారులు ఏక పక్షంగా నిర్ణయాలతో ప్రభుత్వ విద్యారంగంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి గ్రామంలో 1 నుంచి 5 తరగతులతో ప్రాథమిక పాఠ శాలలను తప్పనిసరిగా కొనసాగించాలి. 1 నుంచి 10 తరగతుల విధానాన్ని ఉపసంహరించు కోవాలి. ప్రాథమికోన్నత పాఠశాలలకు అన్ని రకాల సబ్జెక్టు టీచర్లను నియమించాలి.

– నగరి శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ జిల్లా సెక్రటరీ, నంద్యాల

అమ్మ ప్రేమ గెలిచింది!



కుమ్మేస్తా.. కుక్కల గుంపును తరుముతూ



నా బిడ్డ జోలికొస్తే వదిలేదేల్యా..



బిడ్డ జాగ్రత్త..

బిడ్డలంటే తల్లికి పంచప్రాణాలు. మనుషులైనా.. జంతువులైనా అమ్మ ప్రేమ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆకలి తీర్చడంతో పాటు ఆపదలో ప్రాణాలను సైతం అడ్డేస్తుంది. ఇందుకు నిదర్శనమే గోమాత ఘటనే. తోడేళ్ల గుంపులా కుక్కలు ఆవు దూడపై దాడికి యత్నించగా, తల్లి ఆవు గంట పాటు దూడను కాపాడుకునేందుకు కుక్కలతో చేసిన పోరాటం చూసినా వారు ఎవరైనా 'ఇది కదా తల్లి ప్రేమ' అని అనక మానరు. మంగళవారం మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నెలో ఈ ఘటన చోటుచేసుకుంది. పొలాల్లో మేత కోసం ఆవుల మంద వారం రోజులుగా తిరుగుతోంది. ఓ ఆవుకు దాహం వేయడంతో తన బిడ్డతో కలిసి తాగునీటి కోసం ఊళ్లోకి వచ్చింది. గమనించిన కుక్కలు దూడపై మూకుమ్మడిగా దాడికి యత్నించాయి. దీంతో ఆవు తన బిడ్డను కాపాడుకోవడానికి సుమారు గంటపాటు వీరోచిత పోరాటం చేసింది. చివరికి అలసిన కుక్కలు తోక ముడిచి వెళ్లిపోయాయి.

– దొర్నిపాడు

క్లుప్తంగా

కిక్కు దిగేలా జరిమానా !

కర్నూలు: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందు బాబులకు కిక్కు దిగేలా న్యాయమూర్తి జరిమానా విధించారు. కర్నూలు శివారులోని సుంకేసుల రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా 14 మంది మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడ్డారు. వారిని మంగళవారం ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా ఇన్‌చార్జ్ న్యాయమూర్తి అపర్ణ ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఓపెన్ డ్రింకింగ్‌కూ మోతే

కర్నూలు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజాశాంతికి భంగం కలిగించిన నలుగురికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి అపర్ణ తీర్పు వెలువరించారు. దీంతో వారు జరిమానా చెల్లించారు.

మందుబాబుకు జైలుశిక్ష, జరిమానా

రుద్రవరం: మండల పరిధిలోని చిన్నకంబలూరుకు చెందిన సంజీవరాయుడు మోతాదుకు మించి మద్యం సేవించి మోటారు వాహనం నడుపుతూ పట్టుబడటంతో ఆళ్లగడ్డ జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచినట్లు రుద్రవరం ఎస్‌ఐ వరప్రసాదు చెప్పారు. కేసు పరిశీలించిన జడ్జి నిందితుడికి 14 రోజుల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్ష తప్పదని ఎస్‌ఐ స్పష్టం చేశారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సత్తా

కర్నూలు సిటీ: సీబీఎస్‌ఈ టెన్త్ పరీక్షల ఫలితాల్లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ స్కూల్ చైర్మన్ కె.జె రెడ్డి, ప్రిన్సిపాల్ జస్మీత్ కౌర్ షెఖాన్ తెలిపారు. తమ విద్యార్థులు అసాధారణ ఫలితాలు సాధించారని, అధిక శాతం మంది ఏ గ్రేడ్ మార్కులతో ఉత్తీర్ణులయ్యారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. అత్యుత్తమ ప్రమాణాలతో విద్యాబోధన, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, అంకితభావంతో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు వారు వెల్లడించారు. ఈ ఫలితాలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు.

ఖరీఫ్‌కు సిద్ధమవుదాం

- లోతు దుక్కులతో ఎన్నో ఉపయోగాలు
- పొలాల్లో గొర్రెలు మంద కట్టడం వల్ల సేంద్రియ పదార్థం పెరుగుదల
- నేల గుల్ల బారుతుంది.. సకాలంలో విత్తనం వేసుకోవచ్చు
- కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి సూచనలు


వేసవి దుక్కులు చేస్తున్న దృశ్యం

కర్నూలు అగ్రికల్చర్: వేసవి.. పొలాల్లో పంటలు లేని సమయం. అతి ముఖ్యమైన పొలం పనులు చేపట్టాల్సింది వేసవిలోనే. తొలకరితో మొదలయ్యే ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటి నుంచే సమాయత్తం కావాల్సిన అవసరం ఉంది. వేసవిలో చేపట్టే పొలం పనులను బట్టే పంటల పెరుగుదల, దిగుబడులు వస్తాయి. వేసవిలో చేపట్టాల్సిన పనులను కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి వివరించారు.

లోతు దుక్కులు

ఇటీవల జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అకాల వర్షాలు కురిశాయి. ప్రస్తుతం దుక్కులు చేసుకోవడానికి సరిపడా తేమ ఉన్న పొలాల్లో ట్రాక్టర్లు లేదా ఎద్దుల నాగళ్లతో లోతు దుక్కులు దున్నాలి. దుక్కుల లోతు సుమారుగా 9 అంగుళాలకు తగ్గకుండా ఉండాలి. అలా లోతు దుక్కులు చేసినప్పుడు పలు రకాల ప్రయోజనాలు చేకూరుతాయి. వాలుకు అడ్డంగా దున్నుకోవడం అవసరం. వర్షాలు తగ్గినందున వాలుకు అడ్డంగా దున్నుకోవడం వల్ల వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకిపోతుంది.

నేలలోని చీడ పీడలు నశిస్తాయి

లోతు దుక్కులు దున్నినప్పుడు నేలపై పొరల్లో ఉండే పురుగులు, తెగుళ్లను నశింపజేయడానికి అవకాశం ఉంది. నేలను లోతుగా దున్నినప్పుడు నేలలో దాక్కునే లేదా నిద్రావస్థలో ఉంటే పురుగులు, నేలలో ఉండి తెగుళ్లను కలగజేసే శిలీంద్రాలు ఎండల బారిన పడి నశిస్తాయి. అందువల్ల వేసవిలో పొలాలను లోతు దుక్కి చేసుకుంటే తొలకరిలో విత్తుకునే పంటకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

మొండిజాతి కలుపు నివారణ

తుంగ, గరిక, దర్బ వంటి మొండిజాతి కలుపు మొక్కలు పొలంలో పెరిగి పంటలకు నష్టం కలగజేస్తుంటాయి. వీటి వేర్లు, కాయలు, దుబ్బులు నేలలో బాగా విస్తరించి ఉండటం వల్ల నివారణ కష్టం అవుతుంది. పంటలు వేసినప్పుడు వాటితో పాటు పెరిగి నష్టం కలగచేస్తాయి. వేసవిలో దుక్కి బాగా దున్నినప్పుడు ఈ కలుపు మొక్కల కాయలు, వేర్లు దుంపలు పెకలింపబడి, వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రతలకు నశించడానికి అవకాశం ఉంటుంది. నేలపైకి తేలిన కాయలు, వేర్లు దుంపలను ఏరివేసి వీటిని అరికట్టవచ్చు.

నేల గుల్లబారుతుంది

వేసవిలో లోతుగా దుక్కి దున్ని తొలకరి వర్షాలకు గొర్రు తిప్పి గుంటలతో సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. నేల అధికంగా నీటిని పీల్చుకుంటుంది. సేద్యానికి ఉపయోగించే గొర్రు, గుంటక, దంతె వంటి పరికరాలు నేల లోపలికి 3–5 అంగుళాల లోతు వరకు చొచ్చుకొనిపోతాయి. ఈ పరికరాలను ఉపయోగించి పదే పదే సేద్యం చేయడం వల్ల నేల లోపల సుమారుగా 3–5 అంగుళాల లోతులో ఒక గట్టి పొర ఏర్పడుతుంది. అందువల్ల నేలకు నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతుంది. కావున నేలను లోతుగా దున్నినప్పుడు ఈ గట్టి పొర ఛేదింపబడి నేలకు నీటిని పీల్చుకునే శక్తి అధికమవుతుంది.

సేంద్రియ పదార్థం నేలలో కలుస్తుంది...

పంటల కోతల తర్వాత నేలపై మిగిలే పంటల మొదళ్లు పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు వంటి వివిధ సేంద్రియ పదార్థాలన్నీ లోతు దుక్కి దున్నినప్పుడు నేలలో కలిసి కుళ్లిపోతాయి. అందువల్ల నేలలో సేంద్రియ పదార్థాలు, పోషక విలువలు పెరగడానికి అవకాశం ఉంది.

పశువులు/గొర్రెలు మందకట్టడం

ఈ పని కూడా రైతులు వేసవిలో చేసుకోవచ్చు. లోగడ ప్రతి రైతుకు ఎద్దులు, ఆవులు, గేదెలు ఉండేవి. వాటిని రాత్రిళ్లు పొలంలో కట్టేసేవారు. వాటి మల మూత్రాలు పొలానికి తిన్నగా చేరి పంటలకు ఉపయోగపడేవి. ఇందువల్ల ఎరువుల ఖర్చు తగ్గేది. ఇప్పుడు పొంచకట్టేసే పశుగణాలు తగ్గిపోయాయి. పశుగణం ఎక్కువగా ఉండే గ్రామాల్లో ఈ పని ఇప్పటికైనా చేయవచ్చు. గొర్రెలను పొలంలో మందకట్టడం రైతులకు పరిపాటే. ఈ పని ఎండాకాలంలోనే చేయాలి. నిద్రలో ఉన్న గొర్రెల మందలను రాత్రిళ్లు ఎక్కువసార్లు లేపితే ఎక్కువసార్లు పెంటికలను వేస్తాయి. దీనివల్ల చేనుకు అవసరమైనంత గొర్రెల ఎరువు, మూత్రం లభ్యమవుతుంది. ఇలా నేలకు సేంద్రియ ఎరువులను అందించవచ్చు.

పశువుల ఎరువులను తోలడం

సంవత్సరం పొడవునా నిల్వ చేసిన పశువుల ఎరువులను ఎండాకాలంలోనే పొలాల్లోకి తోలా లి. వర్షాలు పడిన తర్వాత పొలాలకు తోలిన పశువుల ఎరువులను నేలపై చల్లి లోతు దుక్కి దున్నితే మట్టిలో బాగా కలుస్తుంది. దీనివల్ల పంటలకు అవసరమైన పోషకాలు అందుతాయి.

గరుడ వాహనంపై పాండురంగడు



కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, సుదర్శనాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, మహాగణపతి పూజ, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, సంప్రోక్షణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి పాండురంగడు ప్రత్యేక అలంకరణలో గరుడ వాహనంపై భక్తులకు కనువిందు చేశారు. ఆలయం నుంచి గాంధీ సెంటర్ వరకు స్వామివారి గ్రామోత్సవం వైభవంగా సాగింది. వివిధ కాలనీలకు చెందిన భక్తులు పాండురంగ విఠలేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నెల్లూరు కళాకారులచే నిర్వహించిన ఆర్కెస్ట్రా అలరించింది. బుధవారం గజేంద్ర వాహనంతో స్వామివారి వాహన సేవలు ముగియనున్నట్లు ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి వెల్లడించారు.

ప్రాణం తీసిన కూటమి నేతల ఒత్తిళ్లు

- తమ్ముడిపై అక్రమ కేసు.. డీలర్‌షిప్ తొలగింపు
- గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి

కోసిగి: ఏ చిన్న అవకాశం దొరికినా కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ వర్గీయులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మండలంలోని చిన్నభూంపల్లికి చెందిన కొత్తాళం పెద్ద ఉసేని (45) గుండెపోటుతో మరణించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. పెద్ద ఉసేని గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కాగా, ఇతని తమ్ముడు చిన్న ఉసేని సర్పంచ్. గత ఏప్రిల్ 10న పెద్ద ఉసేని గ్రామంలో ఓ వ్యక్తితో చిన్న పాటి వ్యక్తిగత గొడవపడ్డాడు. ఆ వ్యక్తి కూటమి నాయకుల అండదండలతో సర్పంచ్ చిన్న ఉసేని, పెద్ద ఉసేనిలతో పాటు మరో ఇద్దరిపై హత్యయత్నం కేసు నమోదు చేయించాడు. ఈమేరకు 20 రోజుల పాటు సబ్ జైల్‌లో గడిపారు. చిన్న ఉసేని రెగ్యులర్ రేషన్ డీలర్ కావడంతో పోలీసు కేసు ఉన్న వ్యక్తిని ఎలా కొనసాగిస్తారని కూటమి నాయకుడు ఆదోని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేశారు. ఈ నెల రేషన్ బియ్యంను కూటమి నాయకులే చేజిక్కుంచుని పంపిణీ చేశారు. తమ్ముడిపై తప్పుడు కేసు, డీలర్‌షిప్‌ను తొలగించడంతో కొద్ది రోజులుగా ఆయన మానసిక వేదనకు లోనయ్యాడు. మంగళవారం ఉదయం కోసిగికి వచ్చి పనులు ముగించుకొని మధ్యాహ్నం ఇంటికి చేరుకోగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు స్థానిక వైద్యులకు చూపించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి పెద్ద ఉసేని మృతి పట్ల సంతాపం ప్రకటించారు. మృతునికి ఇద్దరు భార్యలు లక్ష్మీ, నరసింగమ్మతో పాటు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం ఉన్నారు.

వివాహిత బలవన్మరణం

- పుట్టింటి నుంచి త్వరగా రావాలని కోరినందుకు మనస్తాపం
- క్షణికావేశంలో ఉరి వేసుకుని ఆత్మహత్య
- మృతురాలు మూడు నెలల బాలింత

అనంతపురం/నందవరం: అప్పటికే ఆమెకు ఒక కుమారుడు. తర్వాత రెండో కాన్పులో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ ఇద్దరు బిడ్డలకు తల్లి ప్రేమను దూరం చేస్తూ ఆ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పుట్టింటికి వెళ్లి వెంటనే రావాలని భర్త సూచించడంతో మనస్తాపం చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... మంత్రాలయం మండలం మాధవవరం గ్రామానికి చెందిన బోయ ఈరన్న చిన్న కుమార్తె ఉరుకుందమ్మ (24)కు 2020లో అదే జిల్లా నందవరం గ్రామానికి చెందిన నరసింహులు కుమారుడు పాపయ్యతో వివాహమైంది. వీరికి మూడేళ్ల వయస్సు, మూడు నెలల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో తన సోదరుడు నాగరాజు వివాహ నిశ్చితార్థం ఉండడంతో ఉరుకుందమ్మ పుట్టింటికి వెళ్లింది. నిశ్చితార్థ వేడుక ముగిసిన తర్వాత స్వగ్రామానికి చేరుకోగానే సాయంత్రం పాపయ్య ఫోన్ చేసి తన భార్యను వెంటనే మా ఊరికి పంపాలని మామను కోరాడు. బుధవారం పిలుచుకొస్తామని తెలిపినా అల్లుడు వినలేదు. దీంతో ఆదివారమే కుమార్తెను తండ్రి పిలుచుకెళ్లి భర్త వద్ద వదిలాడు. సోమవారం ఉదయం 11 గంటలకు పాపయ్య మరోసారి ఫోన్ చేసి ఉరుకుందమ్మ కనిపించడం లేదని తెలిపాడు. దీంతో కుమారుడు నాగరాజు, అల్లుళ్లు తాయన్న, రమేష్‌తో కలసి నందవరం గ్రామానికి ఈరన్న చేరుకుని చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చేపట్టాడు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం అనంతపురం త్రీ టౌన్ పోలీసులు ఫోన్ చేసి ఉరుకుందమ్మ రైల్వే స్టేషన్ క్వార్టర్స్ పక్కన చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా తెలిపారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు అనంతపురానికి చేరుకుని ఉరుకుందమ్మ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. అల్లుడి ఒత్తిళ్లు తాళలేకనే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు అనంతపురం మూడో పట్టణ సీఐ కె.శాంతి లాల్ తెలిపారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

ఆస్పరి/ఆదోని రూరల్: ఆదోని మండలం నాగనాథహళ్లి గ్రామ సమీపంలో మంగళవారం పిడుగు పడటంతో ఆస్పరి మండలం ములుగుందం గ్రామానికి చెందిన శంకరబండ గోవిందు (33) అనే గొర్రెల కాపరి మృతి చెందాడు. ములుగుందం గ్రామానికి చెందిన గోవిందుతో పాటు మరోఆరుగురు కాపరులు నాగనాథహళ్లి గ్రామ సమీపంలో గొర్రెలను మేపేందుకు వెళ్లారు. మంగళవారం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. గొర్రెల వద్ద ఉన్న గోవిందుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రంగవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. గోవిందు మృతితో భార్య, పిల్లలు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.


నాగనాథహళ్లి సమీపంలో పిడుగుపాటుకు మృతి చెందిన గోవిందు


ముత్తుకూరులో మృతిచెందిన ఎద్దు

ముత్తుకూరులో ఎద్దు మృత్యువాత

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు గ్రామంలో మంగళవారం పిడుగుపాటుకు కారుమంచి మల్లికార్జున రెడ్డి అనే రైతుకు చెందిన ఎద్దు మృతి చెందింది. రైతు మల్లికార్జునరెడ్డి ఎద్దులను వామిదొడ్డి వద్ద కట్టి ఉంచాడు. ఒక్కసారిగా ఉరుములు ఏర్పడి పిడుగు ఎద్దులపై పడడంతో ఒక ఎద్దు అక్కడిక్కడే మృతి చెందగా, మరో ఎద్దుకు స్వల్ప గాయాలయ్యాయని రైతు తెలిపారు. ఎద్దు మృతి చెందడంతో రైతు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎద్దు మృతితో రూ.80 వేలు నష్టం వాటిల్లిందని, ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరారు.

భయపెట్టిన 'పిడుగు'లు

హొళగుంద: మండలంలోని హొళగుంద, చిన్నహ్యాట, వందవాగిలి, ఎం.డీ హళ్లి, పెద్దగోనెహాళ్, గజ్జహళ్లి తదితర గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు భయం పుట్టించాయి. పక్కనే బాంబులు పడుతున్నట్లు పెద్దఎత్తున పిడుగుల శబ్దానికి ప్రజలు వణికిపోయారు. పెద్దగోనెహాళ్ గ్రామం బీసీ కాలనీలో కాశీంవలి అనే వ్యక్తి గుడిసెకు ముందున్న చెట్టుపై పిడుగు పడటంతో విరిగిపడింది. దీంతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు. కాశీంవలి కుటుంబ సభ్యులు బంధువుల ఊరికి వెళ్లడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదని గ్రామస్తులు తెలిపారు. దాదాపు అరగంటకు పైగా ఉరుములు, మెరుపులు, పిడుగుల శాబ్దాలతో పాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో పొలాల్లో నీరు నిలిచాయి. హొళగుంద తేరుబజారులో నీరు చేరింది. వరి ధాన్యాన్ని అమ్ముకోని రైతులు రైస్‌మిల్లులు, పొలాలు, ఎల్లెల్సీ గట్లపై వేసుకున్న ధాన్యం తడవకుండా టార్పిళ్లు కప్పి బిక్కుబిక్కుమంటూ గడిపారు.


పెద్దగోనెహాళ్‌లో పిడుగుపాటుకు విరిగిపడిన చెట్టు

భార్య హత్యకేసులో భర్త అరెస్టు

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలో ఈనెల 9న షేక్ జకీయా బేగంను హత్య చేసిన కేసులో ఆమె భర్త షేక్ రసూల్‌ను అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వర రావు మంగళవారం తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడైన షేక్ రసూల్ కోసం గాలింపు చేపట్టి బనగానపల్లె రహదారిలోని చెలిమె వద్దనున్న మౌలాలి స్వామి దర్గా వద్ద అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కేసు విచారణలో తానే భార్యను హత్య చేసినట్లు నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసి డోన్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపినట్లు సీఐ వెల్లడించారు. ఎస్‌ఐ రమేష్‌బాబు, పోలీస్ సిబ్బంది రాఘవేంద్ర, దస్తగిరి, చంద్రశేఖరప్ప, మహేష్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

సంజామల: మండల పరిధిలోని మెట్టుపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అవుకు పట్టణానికి చెందిన మూడవత్ రసూల్ నాయక్ (56) ఉదయం రామాపురం వద్ద ఉన్న టన్నెల్ వద్దకు పనికి వెళ్తున్నాడు. మెట్టుపల్లె సమీపంలో బైక్‌పై వెళ్తున్న రసూల్ నాయక్‌ను ఎదురుగా వచ్చిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు జనార్దన్ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రసూల్ నాయక్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

ఆలూరు రూరల్: కారు, మినీ లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. మండలంలోని హులేబీడు సమీపంలోని హైవే–167లో మంగళవారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు.. బళ్లారికి చెందిన రంగప్రసాద్ కుటుంబంతో కలిసి ఎమ్మిగనూరు నుంచి కారులో బళ్లారికి వెళ్తున్నాడు. మండలంలోని మొలగవల్లి గ్రామానికి చెందిన మినీ లారీ కందుల లోడుతో ఆదోనికి వెళ్తోంది. హులేబీడు గ్రామ సమీపంలో కారు, మినీ లారీని వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న రంగప్రసాద్ చెయ్యి విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. భార్య అనురాధ, కుమారులు గౌతం రంగ, మౌనిత్ రంగకు స్వల్ప గాయాలయ్యాయి. అలాగే మినీలారీ డ్రైవర్ ప్రతాప్, కందులను విక్రయించేందుకు వెళ్తున్న రైతు గాదిలింగకు గాయాలయ్యాయి. అక్కడున్న వారు క్షతగాత్రులను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


మినీ లారీ బోల్తా పడటంతో రోడ్డుపై పడిన కందులు

కుక్కను తప్పించబోయి కారు బోల్తా

- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసిఫారం సమీపంలో సోమవారం అర్ధరాత్రి కుక్కను తప్పించబోయి కారు బోల్తా పడటంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. వివరాలు.. పట్టణానికి చెందిన షేక్ అమాన్‌అలీ, కటికె జమీర్ కారులో ఆదోనికి వెళ్లి బంధువులను కలుసుకున్నారు. తిరిగి ఎమ్మిగనూరుకు వస్తుండగా అర్ధరాత్రి బనవాసి ఫారం వద్ద రోడ్డుపై కుక్క అడ్డుగా రావటంతో తప్పించబోయి కారు పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న షేక్ అమాన్‌అలీ (23) అక్కడిక్కడే మృతి చెందగా, వెనక సీట్లో కూర్చున్న కటికె జమీర్‌కు గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ పోలీసులు మంగళవారం సాయంత్రం తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షకు 496 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 59 కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షకు 496 మంది గైర్హాజరయ్యారు. 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 3,729 మందికిగాను 3,265 మంది హాజరుకాగా 464 మంది గైర్హాజరయ్యారని, 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 304 మందికిగాను 272 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆరుగురు విద్యార్థులు చూచిరాతకు పాల్పడగా గుర్తించి డిబార్ చేసినట్లు వెల్లడించారు.

నవోదయలో వంద శాతం ఉత్తీర్ణత

ఎమ్మిగనూరురూరల్: సీబీఎస్సీ విడుదల చేసిన 10వ తరగతి, 12వ తరగతి ఫలితాల్లో మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక విద్యాలయంలో ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ.. తమ పాఠశాల నుంచి 10వ తరగతిలో 82 మంది, 12వ తరగతిలో 36 మంది పరీక్షలు రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. సోషల్, సైన్సు సబ్జెక్టులలో ఐదుగురు, గణితంలో ఇద్దరు 100 మార్కులు సాధించినట్లు చెప్పారు. 12వ తరగతిలో సి.దీప్తిప్రియ 462/500 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

22న కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కర్నూలు(అర్బన్): జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ఈ నెల 22వ తేదీన ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు సంఘం నేతలు తెలిపారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, ప్రధాన కార్యదర్శి అనిత పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. గతంలో ప్రకటించిన మేరకు ఈ నెల 5వ తేదీలోపు తమకు అందిన మార్కుల జాబితాలు, కుల ధ్రువీకరణ పత్రాల మేరకు ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. పెద్దపాడు రోడ్డులోని బీరప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.


సమావేశంలో పాల్గొన్న కురువ సంఘం నేతలు